సాక్షి మంచిర్యాల

శుక్రవారం, 9, జూన్, 2023



మధ్యాహ్నం ఆకలి తీర్చండి!

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు పస్తులుండాల్సి వస్తోంది. 8లో▸



చెరువుల పండుగలో ఎంపీ

దండెపల్లి: మండలంలోని కన్నెపల్లిలో గురువారం చెరువుల పండుగ వేడుకల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత పాల్గొన్నారు. మంచిర్యాలకు వెళ్తుండగా ర్యాలీ కనిపించడంతో ఆగారు. స్థానిక సర్పంచ్ రజిని, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /31.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా వడగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 12నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో శైలజ అన్నారు. గురువారం మంచిర్యాలలో సీఎస్, డీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 2,120, ద్వితీయ సంవత్సరం 1,906 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. మంచిర్యాల, మందమర్రి, చెన్నూర్, జైపూర్, జన్నారం, దండేపల్లి, బెల్లంపల్లి(బాలికలు), ప్రభుత్వ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. లక్సెట్టిపేట(ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ బాలుర), ప్రభుత్వ జూనియర్ కళాశాల, మిమ్స్ జూనియర్ కళాశాల, ఎస్‌ఆర్‌ఆర్, విజన్, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు చోటు చేసుకుండా చూడాలని, పరీక్ష విధులు, నిబంధనలపై పరీక్షల సీఎస్, డీవోలకు సూచించారు.

14నుంచి ఎస్సెస్సీ..

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 14నుంచి 22 వరకు ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి 12.30 వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మంచిర్యాల, బాలికల ఉన్నత పాఠశాల మంచిర్యాల, లక్సెట్టిపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్(బాలికలు), బెల్లంపల్లి బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాళ్ల గురిజాల టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్(బాలుర) జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

'నకిలీ విత్తన' ముఠా అరెస్టు

- వరంగల్‌లో పట్టుబడిన జిల్లా వాసులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నకిలీ పత్తి విత్తనాల దందా చేస్తూ జిల్లాకు చెందిన ఐదుగురు వరంగల్ పోలీసులకు చిక్కారు. వరంగల్ పోలీసులు ఈ మేరకు అరెస్టు చూపించారు. రెండు ముఠాల్లో మొత్తం 15మంది నిందితులు ఉండగా ఇందులో మంచిర్యాల జిల్లాకు చెందిన వారు ఐదుగురు ఉన్నారు. రూ.2కోట్లకు పైగా విలువైన నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. ఈ దందాలో జిల్లాకు చెందిన వారు ఈ ప్రాంతంలో నకిలీ విత్తనాలు రైతులకు గుట్టుగా సరఫరా చేస్తున్నారు. గుజరాత్ నుంచి విత్తనాలు దిగుమతి చేసుకుని, అచ్చం గుర్తింపు పొందిన విత్తనాల వలే ప్యాకింగ్, లేబుల్ వేసి నేరుగా విత్తన డీలర్లతోనే అమ్మిస్తున్నారు. ఇందులో విత్తన కంపెనీల ప్రతినిధులతో సహా, మధ్య ఏజెంట్లు ఉన్నారు. హెచ్‌టీ బీజీ3(హెర్బిసైడ్ టాలరెంట్)గా ఉన్న లూజు విత్తనాలు. వీటినే ప్యాకింగ్ చేసి రైతులకు అడ్డదారిలో అందిస్తున్నారు. జిల్లాలో గత కొన్నేళ్లుగా వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ దందాలో ప్రతీ సీజన్‌లో కొత్త వారు వస్తున్నారు. ఇంకా జిల్లాలో ఈ విత్తన దందా చేస్తున్న వారిపై దృష్టి సారిస్తే పూర్తిగా అదుపులోకి వచ్చే అవకాశం ఉంది.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం



లైట్లను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

నస్పూర్: పట్టణ పరిధిలోని తోళ్లవాగు నుంచి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వరకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కేసీఆర్ రాక



సీఎం బహిరంగ సభకు సిద్ధమైన వేదిక

- జిల్లా పర్యటనకు సర్వం సిద్ధం
- కొత్త కలెక్టరేట్, పార్టీ కార్యాలయం, పథకాలు ప్రారంభం
- చెన్నూరు ఎత్తిపోతలతోపాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నస్పూర్‌లో భారీ బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు జిల్లా పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. శుక్రవారం సాయంత్రం నస్పూర్‌కు రానున్న సీఎం కేసీఆర్ మొదట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, కలెక్టరేట్ ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బహిరంగ సభాస్థలికి వెళ్తారు. బీసీ కులవృత్తులకు ఆర్థిక చేయూతనిచ్చే రూ.లక్ష ఆర్థికసాయం పథకం, రెండో విడత దళితబంధు, స్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారికి రూ.3లక్షల సాయం అందించే గృహలక్ష్మి పథకం ప్రారంభిస్తారు. లబ్ధిదారులకు సీఎం చేతుల మీదుగా లాంఛనంగా చెక్కులు అందజేస్తారు. దొనబండకు చెందిన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రూ.1658కోట్ల వ్యయంతో, లక్ష ఎకరాలకు సాగునీరందించే చెన్నూరు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారు. మందమర్రిలో రూ.500కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ, రూ.164కోట్లతో గోదావరినదిపై నిర్మించనున్న మంచిర్యాల, అంతర్గాం రోడ్డు బ్రిడ్జి, హాజీపూర్ మండలం గుడిపేటలో రూ.205కోట్లతో వైద్యకళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

భారీ బహిరంగ సభ

సీఎం కేసీఆర్ పర్యటనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి నస్పూర్ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు రోడ్లు, డివైడర్ల వెంట భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గులాబీ జెండాలతో అలంకరించారు. నస్పూర్ పట్టణం కలెక్టరేట్ సమీపంలోనే 40ఎకరాల్లో సభకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. 200మంది కూర్చునేలా భారీ వేదిక సిద్ధం చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ వెంకటేశ్ నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు. గ్రామ, మండల, పట్టణాల్లో సన్నాహక సభలతో కార్యకర్తలు, నాయకులు భారీగా జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. తాగునీటి కోసం వాటర్ ప్యాకెట్లు, కూల్ వాటర్, మజ్జిగ ప్యాకెట్లు, భోజనాలు సిద్ధం చేశారు. వేదిక ముందు కుర్చీలు, టెంట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్, భారీ లైటింగ్‌లు ఏర్పాటు చేశారు.

రెండు వేల మందితో బందోబస్తు

సీఎం పర్యటనకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆరుగురు డీసీపీ స్థాయి అధికారులు, 21మంది అడిషనల్ ఎస్పీలు, 62మంది సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పీసీలు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ, మహిళా పోలీసులతో మొత్తం 2350మంది పోలీసులతో బందోబస్తు సాగనుంది. ఈ మేరకు మంచిర్యాల డీసీపీ రామ్‌నాథ్ కేకన్, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ నేతృత్వంలో పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నారు.

షెడ్యూల్ ఇలా..



సీఎం కేసీఆర్ శుక్రవారం సాయంత్రం 4గంటలకు ప్రగతి భవన్ నుంచి బయల్దేరుతారు. బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని హెలికాప్టర్‌లో బయల్దేరి మంచిర్యాలకు 5గంటల వరకు చేరుకుంటారు. 5.10గంటలకు రోడ్డు మార్గంలో నస్పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకుని ప్రారంభిస్తారు. 5.25గంటలకు అక్కడి నుంచి బయల్దేరి 5.30గంటలకు కొత్త కలెక్టరేట్‌కు చేరుకుని ప్రారంభోత్సవం చేస్తారు. 6.25గంటలకు అక్కడి నుంచి బయల్దేరి 6.30 గంటలకు బహిరంగ సభకు హాజరై ప్రసంగిస్తారు. బహిరంగ సభ అనంతరం 7.30గంటలకు రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్తారు. 10.30 గంటలకు ప్రగతిభవన్‌కు చేరుకుంటారు.



విద్యుత్ దీపాల వెలుతురులో కొత్త కలెక్టరేట్



బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం

ఒకే చోట 34కార్యాలయాలు

- అన్ని హంగులతో కలెక్టరేట్ భవనం
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం



కొత్త కలెక్టరేట్ ప్రారంభ వేదిక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేక అటు అధికారులు ఇటు ప్రజలు అవస్థలు పడ్డారు. ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని దుస్థితి ఎదురైంది. అద్దె భవనాలు, జిల్లా కేంద్రంతోపాటు శివారు గ్రామాల్లోనూ ఉన్నాయి. దీంతో పరిపాలనలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడేవి. ప్రజలు, అధికారులు కనీసం కూర్చునేందుకు వీలు లేకపోవడంతో ఇబ్బంది పడేవారు. నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల భవనం ఏర్పాటుతో ఈ బాధలన్నీ తీరనున్నాయి. జిల్లా ఏర్పడ్డాక ఐదేళ్లకు కొత్త కలెక్టరేట్ ప్రజలకు అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే ఆయా ప్రభుత్వ శాఖలకు గదులు కేటాయించారు. పక్కనే కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఉంటుంది.

సకల సౌకర్యాలతో

గ్రౌండ్, రెండంతస్తుల్లో భవనం సువిశాలంగా నిర్మించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లకు ప్రత్యేక చాంబర్లు, జిల్లా అధికారులకు ప్రతీ శాఖకు కార్యాలయం, 25మంది నుంచి 250మంది సామర్థ్యం ఉన్న సమావేశ మందిరాలు, నాలుగు లిఫ్టులు, రెండు ఫ్లోర్‌లోనూ 40మంది సామర్థ్యంతో కాన్ఫరెన్స్ హాళ్లు, విశ్రాంతి హాళ్లు, ఏ, బీ, సీ, డీ, ఈ టైప్ హాళ్లు, సిబ్బందికి హాళ్లు, మరుగుదొడ్లు, వంట గదులు, రికార్డు, స్ట్రాంగ్ రూంలు, 66కార్లు పార్కు చేసే భారీ పార్కింగ్, కారిడార్లు, గార్డెనింగ్, పొంటేయిన్, హెలీ ప్యాడ్ ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలతో కలెక్టరేట్ రూపుదిద్దుకుంది.

విస్తీర్ణం 26ఎకరాలు, వ్యయం రూ.55కోట్లు
భవన నిర్మాణ స్థలం 1,39,468 చదరపు అడుగులు

చంద్రశేఖరా.. హామీలు నెరవేర్చరూ..!



నస్పూర్ షిర్కేకాలనీలో కంపెనీ క్వార్టర్‌ను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్(ఫైల్)

- సింగరేణి కార్మికుల మొర
- డిపెండెంట్ వయస్సు పెంచాలి
- పెండింగ్‌లో మారు పేర్ల సమస్య
- సొంతింటి పథకం అమలు చేయాలి
- గుదిబండగా ఆదాయ పన్ను
- నేడు సింగరేణి క్షేత్రానికి కేసీఆర్ రాక

శ్రీరాంపూర్: ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు తమకు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం హోదాలో కార్మిక వర్గానికి అనేక వాగ్దానాలు చేశారు. ఇందులో కొన్ని నెరవేర్చినా ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి శుక్రవారం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో కార్మికవర్గం తమ సమస్యలను ఏకరువు పెడుతున్నారు. ఇక్కడ జరిగే సభ నుంచైనా పాత హామీల అమలు కోసం ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

మారు పేర్ల సమస్య

గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ గెలిచిన తర్వాత, సాధారణ ఎన్నికలకు ముందు 2018, ఫిబ్రవరి 27న సీఎం కేసీఆర్ శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన సింగరేణి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. అంతకుముందు అదే నెల 8న ప్రగతిభవన్‌లో జరిగిన సమావేశంలో కూడా పలు హామీలు ఇచ్చారు. వీటిలో కొన్ని నెరవేర్చారు. మారు పేర్లతో కంపనీలో పని చేసేవారి పేర్లను క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయస్సు ప్రతిబంధకంగా మారింది. 35 ఏళ్ల వయస్సును 45 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదన అలాగే ఉంది. కార్మికుల వేతనాల్లో 30 శాతం ఆదాయపన్నుకే పోతోందని, దీనిపై ఆదాయ పన్ను మాఫీ చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన కేసీఆర్ కనీసం కోలిండియాలో ఇస్తున్నట్లుగా అలవెన్సు(పెర్క్స్)పై విధించే ఐటీని కంపెనీలేదా ప్రభుత్వం కట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వీఆర్ఎస్ పోరు నిత్యకృత్యం..

సింగరేణిలో వీఆర్ఎస్ డిపెండెంట్ల సమస్య నిత్యకృత్యంగా ఉంది. 2002 నుంచి వారు తమ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్నారు. 1997–2001 మధ్య వీఆర్ఎస్ డిపెండెంట్లను ఉద్యోగాల్లోకి తీసుకొని, కొందరికి ట్రెనింగ్ ఇచ్చి, మరికొందరిని మెడికల్ ఫిట్ చేసుకొని, కొందరికి మూడు నెలల జీతం ఇచ్చిన కూడా వారందరినీ అర్ధంతరంగా ఖాళీలు లేవని ఉద్యోగాలను రద్దు చేశారు. అప్పటి నుంచి వీరు ఎక్కని మెట్టులేదు, కొట్లాడని వేదిక లేదు. దీనిపై ఉద్యమ సమయంలో కేసీఆర్ స్పందించి వారందరికీ తెలంగాణ వస్తే ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు.

కొత్త గనులు లేకుంటే భవిష్యత్తు ఎలా..

సింగరేణిలో ప్రస్తుతం కొత్త గనులు వచ్చే అవకాశం లేదు. కేంద్రం చేసిన ఎంఎండీఆర్ యాక్ట్–2021 వల్ల సింగరేణి స్వంతంగా కొత్త గనులు తీసుకొనే వీలులేకుండా పోయింది. దీంతో సింగరేణి పరిధిలోని నాలుగు బొగ్గు బ్లాకులను కేంద్రం వేలం వేసింది. కేంద్ర ప్రభుత్వంతో రాజకీయవైరం కారణంగా సింగరేణి సంస్థ మరింత గడ్డు పరిస్థితులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. యాక్ట్‌కు భిన్నంగా కొత్త గనులు తీసుకోలేని సమయంలో కనీసం చట్టబద్ధంగా యాక్షన్‌లో పాల్గొని అయినా గనులను దక్కించుకుంటేనే సంస్థకు భవిష్యత్ ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

శ్రీరాంపూర్‌లో క్వార్టర్ల కొరత

శ్రీరాంపూర్‌లో కంపెనీ క్వార్టర్ల కొరత తీవ్రంగా ఉంది. కంపెనీలోనే అతి పెద్ద ఏరియా శ్రీరాంపూర్‌లో 9404 మంది ఉద్యోగులు పనిచేస్తుంటే 6850 క్వార్టర్లు మాత్రమే ఉన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంపూర్ వచ్చిన సందర్భంగా నస్పూర్ షిర్కేకాలనీలోని ఓ క్వార్టర్‌ను స్వయంగా సందర్శించారు. ఇరుకు క్వార్టర్లను చూసి చలించిన ఆయన దీనిపై స్పందిస్తూ కార్మికులకు కొత్తగా డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. భూపాలపల్లి వంటి ఏరియాల్లో కొత్తగా క్వార్టర్లు నిర్మించినా అధిక కొరత ఉన్న శ్రీరాంపూర్‌లో ఒక్క క్వార్టర్ కూడా నిర్మించకపోవడంపై కార్మికులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యమంత్రి స్పందించి తమ డిమాండ్లు, పాత హామీలు నెరవేర్చాలని కార్మికవర్గం కోరుతోంది.

సొంతింటి కల మిథ్యే..

సింగరేణిలో 40 ఏళ్లు రెక్కలు ముక్కలు చేసుకొని పని చేసిన కూడా విరమణ తర్వాత సింగరేణి ప్రాంతంలో ఇంటి స్థలం కొనాలంటే రిటైర్మెంట్ డబ్బులు చాలడం లేదని వాపోతున్నారు. కంపెనీలో మైనింగ్ అవసరాలకు ఉపయోగపడకుండా ఉన్న స్థలాలో ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతున్నారు. దీని కోసం స్వంతింటి పథకం అమలు చేయాలని విన్నవిస్తున్నారు. సింగరేణి మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే సంస్థ కాబట్టి ఈ ప్రాంత పిల్లలకు మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే అనేక పరిశోధనలు చేసుకునే వీలుంటుందని, తద్వారా కంపెనీలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొంటున్నారు.

ఆశలన్నీ సీఎం పైనే !

సీఎం కేసీఆర్ ఐదేళ్ల తర్వాత జిల్లాకు వస్తుండడంతో ఇక్కడి ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రాంత సమస్యలు తీర్చుతారని, హామీలు కురిపిస్తారనే భరోసాతో ఉన్నారు. శుక్రవారం కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి బహిరంగ సభలో మాట్లాడనున్నారు.
– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

- జిల్లా రైతన్నకు సాగునీరందాలి
- మున్సిపాలిటీలకు నిధులు ఇవ్వాలి
- పారిశ్రామిక రంగానికి ఊతమివ్వాలి
- సీఎం వరాలపై జిల్లా వాసుల ఆశలు

సాగు నీరందాలి

సాగునీటి ప్రాజెక్టులు లేక రైతన్నలు గోస పడుతున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం తరచూ పైపులైన్ల లికేజీతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. తలాపునే గోదావరి, ప్రాణహిత నదులు ప్రవహిస్తున్నప్పటికీ సీరందడం లేదు. జిల్లాలో భారీ స్థాయి ప్రాజెక్టులేవీ లేవు. బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాలకు నేటికీ సాగునీరు అందని ద్రాక్షగానే మారింది. కొత్తగా నిర్మించనున్న ఎత్తిపోతల పథకంతో చెన్నూరు నియోజకవర్గానికి మాత్రమే మేలు జరగనుంది. బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలకు సాగునీరందించాల్సి ఉంది. జన్నారం మండలంలో కడెం కాలువలు డీ13, పిల్ల కాలువ ఆధునీకరించి చివరి ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. డీ30, డీ42వరకు కాలువ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట వరకు ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది.

వరదలతో ముప్పు

గోదావరి నదీ తీరంలో ఉన్న జిల్లా కేంద్రం మంచిర్యాల, నస్పూర్ పట్టణాలకు వరదలతో ముప్పు వాటిల్లుతోంది. గత సీజన్‌లో రూ.కోట్ల ఆస్తి నష్టం జరిగింది. వరదల ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ఇక కాళేశ్వర ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి అన్నారం, సుందిళ్ల, బ్యారేజీల ప్రభావంతో జైపూర్, చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల ప్రాణహిత, గోదావరి నదీ తీర ప్రాంతాల్లో రైతుల వందల ఎకరాల పంట నీట మునుగుతోంది. గత వానాకాలంలో మూడు సార్లు పంటలు మునగడంతో రైతులు పెట్టుబడి నష్టపోయారు. పరిహారం సైతం అరకొరగా అందడంతో అవస్థలు పడ్డారు.

పరిశ్రమలకు ఊతమివ్వాలి

పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న జిల్లాలో ఎంసీసీ(ఏసీసీ), శాలివాహన ప్లాంట్లు మూతపడి ఉద్యోగులు రోడ్డున పడుతున్నారు. వీటి పునరుద్ధరణకు సర్కారు పూనుకుంటే కార్మికులకు మేలు జరగనుంది. మందమర్రిలో తోళ్ల పరిశ్రమ పునరుద్ధరణకు నోచుకోవడం లేదు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు దరఖాస్తు చేసుకున్న వారికి నిధులు మంజూరు కావడం లేదు. జైపూర్ థర్మల్ ప్లాంట్‌లో స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా చొరవ చూపాల్సి ఉంది.

ఇంజినీరింగ్ కాలేజీ

ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ లేక విద్యార్థులందరూ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త మండలాల్లో జూనియర్ కాలేజీలు అందుబాటులోకి రాలేదు. అన్ని సబ్జెక్టులతో పీజీ కాలేజీ ఏర్పాటు చేయాల్సి ఉంది. వైద్యశాఖలో ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఉప కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించాల్సి ఉంది. మారుమూల ప్రాంతాల్లో పీహెచ్‌సీల్లో వైద్యం అరకొరగానే అందుతోంది.

పట్టణాలకు నిధులు కావాలి

బల్దియాల్లో అభివృద్ధి పనులకు నిధులు అవసరమున్నాయి. మంచిర్యాల, నస్పూర్, చెన్నూరు, రామకృష్ణాపూర్, మందమర్రి, లక్సెట్టిపేట, బెల్లంపల్లి పట్టణాల్లో అభివృద్ధి పనులకు నిధుల్లేక జాప్యం జరుగుతోంది. మందమర్రి ఏజెన్సీ వివాదం తొలగక అభివృద్ధికి నోచుకోవడం లేదు. వామపక్ష ప్రభావిత గ్రామాలు, అటవీ అనుమతులు రాక, కోటపల్లి, చెన్నూరు, వేమనపల్లిలో రోడ్ల నిర్మాణం జరగడం లేదు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- ఏర్పాట్ల పరిశీలన

నస్పూర్: సీఎం కేసీఆర్ శుక్రవారం నాటి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. గురువారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం, బహిరంగ సభాస్థలి, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, మాజీ ఎమ్మెల్యే అరవిందర్‌రెడ్డి, జిల్లా అధికారులతో కలిసి సందర్శించారు. సభా ఏర్పాట్లను జిల్లా అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విప్ సుమన్ మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్ భవనం అన్ని హంగులతో పూర్తి చేసుకుని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమైందని తెలిపారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా పోలీసు శాఖ, అధికారులు సమన్వయంతో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బహిరంగ సభకు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, మజ్జిగ పంపిణీ నిరంతరంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న సుమన్, కలెక్టర్ సంతోష్

చేపలకు భలే గిరాకీ

- మృగశిర కార్తెతో కొనుగోలుకు ఎగబడ్డ జనం
- జిల్లాలో 400 నుంచి 600 క్వింటాళ్ల విక్రయాలు



మంచిర్యాలలో చేపల విక్రయాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: మృగశిర కార్తె కావడంతో గురువారం జిల్లాలో చేపల మార్కెట్లు జన సందడిగా మారాయి. జిల్లా కేంద్రం మంచిర్యాలలోని చేపల మార్కెట్, కాలేజీ రోడ్డు, హమాలీవాడ రైల్వేగేట్, ప్రభుత్వ ఐటీఐ కాలేజీ వద్ద మత్స్యకారులు ఏర్పాటు చేసిన చేపల విక్రయ కేంద్రాల వద్ద ఎగబడి కొనుగోలు చేశారు. మృగశిర కార్తె రోజు చేపల కూర తింటే మంచిదని అనాదిగా వస్తున్న ఆచారంతో చేపలకు భలే గిరాకీ ఏర్పడింది. ప్రాజెక్టులు, గ్రామాల్లోని చెరువుల వైపు పరుగులు తీశారు. ఉదయం ఆరు గంటల నుంచే ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద జాలర్ల నుంచి జోరుగా కొనుగోలు చేశారు. మత్స్యకారులు సాధారణ రోజుల కంటే రెట్టింపు ధరలకు విక్రయించారు. జిల్లాలో సుమారు 500 నుంచి 600 క్వింటాళ్ల చేపలు విక్రయాలు సాగాయి. బొమ్మ చేప కిలో రూ.500 నుంచి రూ.600, రవ్వ, మెరిగే, బొచ్చె చేపలు కిలో రూ.200 నుంచి రూ.250 ధర పలికాయి.

క్లుప్తంగా

బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు

జన్నారం(ఖానాపూర్): ప్రేమిస్తున్నానని చెప్పి బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తానాజీనాయక్ తెలిపారు. జన్నారంకు చెందిన మహ్మద్ మునీర్‌కు ఇదివరకే వివాహంకాగా అతని భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాలిక (17) పరిచయం పెంచుకున్నాడు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఏడాదిన్నరకాలంగా శారీరకంగా వాడుకున్నాడు. ఈ నెల 6 తనను ఎప్పుడు పెళ్లి చేసుకుంటావని మునీర్‌ను నిలదీయడంతో వివాహానికి నిరాకరించాడు. దిక్కున్నచోట చెప్పుకొమ్మని, మరోసారి పెళ్లి గురించి మాట్లాడితే చంపుతానని బెదిరించాడు. విషయాన్ని ఇంట్లో చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై తానాజీ నాయక్ విచారణ జరిపి మునీర్‌పై పోక్సోయాక్టు కింద కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య



విచారణ చేస్తున్న పోలీసులు

వాంకిడి(ఆసిఫాబాద్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన టింకె కిషన్ (38) వ్యవసాయ కూలీ. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మద్యం సేవించి ఇంటికి వచ్చి అన్నంతిని పడుకున్నాడు. గురువారం తెల్లవారుజామున బయటికి వెళ్లి గ్రామ సమీపంలోని సవారి బంగ్లా వద్ద గల మర్రిచెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య నానుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

సీఎం ఎన్టీఆర్‌నగర్‌ను సందర్శించాలి



మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: గతేడాది కురిసిన వర్షాలు, వరదలతో మునిగిపోయిన ఎన్టీఆర్‌నగర్ కాలనీ ముంపు ప్రాంతాన్ని సీఎం కేసీఆర్ సందర్శించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. గురువారం కాలనీవాసులతో కలిసి ఆయన మాట్లాడుతూ వరదలతో నష్టపోయిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్దన్, తుల ఆంజనేయులు, అమిరిశెట్టి రాజు, కంకణాల సతీశ్, రంగ శ్రీశైలం, రాకేశ్‌రెన్వా, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం ఆకలి తీర్చండి..!

- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఆశలు
- సీఎం పర్యటన నేపథ్యంలో విద్యార్థుల ఎదురుచూపులు



మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఈ నెల 1 నుంచి పునఃప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇప్పుడిప్పుడే కళాశాల బాటపడుతున్నారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలపై అధ్యాపకులు దృష్టి సారించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై కరపత్రాల ద్వారా అధ్యాపకులు విస్తత ప్రచారం చేస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే కళాశాలల్లో డ్రాపౌట్స్ నివారించటంతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్నం భోజనం అమలుకు నిర్ణయించినట్లు జూలై 18, 2020న ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. కరోనా నేపథ్యంలో ఈ పథకం అమలుకు నోచుకోలేదు. గతేడాది అయినా అమలు చేస్తారని ఎదురుచూసిన విద్యార్థులకు నిరాశ తప్పలేదు. 2023–24 విద్యాసంవత్సరంలో జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభమైనా మధ్యాహ్నం భోజనం అమలుపై సందిగ్ధం తొలగలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు జిల్లాకు రానున్న నేపథ్యంలో ఇప్పుడైనా మధ్యాహ్న భోజనం అమలు ప్రకటనపై క్లారిటీ వస్తుందని విద్యార్థులు గంపెడాశతో ఉన్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, గురుకులాలు, మోడల్, కేజీబీవీలు కలిపి 53 కళాశాలలు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని మొత్తం 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,600 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆయా కళాశాలలకు వస్తుంటారు. ఉదయం 9.30 గంటల వరకు గ్రామీణ ప్రాంత విద్యార్థులు కళాశాలలకు వెళ్లాలంటే ఇంటి నుంచి సుమారు 8 గంటలకే బయలుదేరాలి. పేద విద్యార్థుల ఇళ్లల్లో ఉదయం పూట సమయానికి వంట కాకపోవటంతో ఒక్కోసారి అల్పాహారం తీసుకోకుండానే కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో అర్ధాకలితో ఉన్న విద్యార్థులకు తరగతి గదిలో అధ్యాపకులు బోధించే పాఠాలు అర్థంకాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

మందకొడిగా ప్రవేశాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు మందకొడిగా సాగుతున్నాయి. కళాశాలలు ప్రారంభమై ఎనిమిది రోజులు గడిచిపోయాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ కళాశాలల్లో పదుల సంఖ్యలో కూడా అడ్మిషన్లు కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలతో పాటు ఆదర్శ కళాశాలలు, కేజీబీవీల సంఖ్య ఎక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు వసతిగృహాలు ఉన్న కళాశాలల్లోనే చేరేందుకు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలోని ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 600 మంది ప్రవేశాలు పొందితే కేవలం వసతి సౌకర్యం లేకపోవటంతో 200 మంది విద్యార్థులు వెనక్కి వెళ్లిపోయారని ఓ అధికారి తెలిపారు. కనీసం మధ్యాహ్న భోజనం అమలు చేస్తే కొంతమేర అయినా విద్యార్థులకు సౌకర్యంగా మారి ప్రవేశాల సంఖ్య ఊపందుకునే అవకాశాలుంటాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'మధ్యాహ్నం'తో విద్యార్థులకు మేలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రవేశాల సంఖ్య కూడా పెరుగుతుంది. విద్యార్థులు రెండు పూటలా తరగతులకు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుంది.

– శైలజ, డీఐఈవో, మంచిర్యాల

బాలికల హాస్టల్‌కే అప్పగించాలి

మంచిర్యాలఅర్బన్: ఎన్టీఆర్‌నగర్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించిన సాంఘిక సంక్షేమ పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతిగృహ భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న కలెక్టర్ కార్యాలయ భవనం ఖాళీ చేసిన వెంటనే వారికే కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, స్కావెంజర్లను నియమించాలని, ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం చేయాలని, బెల్లంపల్లిలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్లను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

మినీ లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సునీల్ మాదిగ

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి మండల కేంద్రంలోని పాలవాగు సమీపంలో ఏర్పాటు చేయనున్న మినీ లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ పార్క్ పేరిట 2003లో సింగరేణి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించగా ప్రభుత్వం సబ్‌స్టేషన్ కూడా ఏర్పాటు చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వం సుమారు వెయ్యి మందికి శిక్షణ కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. పార్క్ ప్రారంభిస్తే వేలాది మందికి ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మంచిర్యాల పర్యటనలో భాగంగా నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కదారి రమేశ్, నాయకులు విజయ్‌కుమార్, కుమార్, సమ్మయ్య, రాజేశ్, భీమయ్య, రాఘవులు, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ డివిజన్ కల నెరవేరేనా?

- ముఖ్యమంత్రి రాకతో చిగురిస్తున్న ఆశలు
- రెవెన్యూ డివిజన్ ఏర్పడితే ప్రజలకు మేలు



అధికారులు తయారు చేసిన పారుపల్లి మండల మ్యాప్

చెన్నూర్: జిల్లాకు ముఖ్యమంత్రి రాకతో చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు రెండు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తానని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ హామీ ఇచ్చారు. 2019లో రెవెన్యూ డివిజన్‌తో పాటు కొత్త మండలాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేశారు. మండలాల విభజన ప్రక్రియ సైతం పూర్తి చేశారు. ఫైల్ ముఖ్యమంత్రి వద్ద ఉంది. శుక్రవారం సీఎం జిల్లా పర్యటనలో చెన్నూర్ ప్రాంతవాసుల చిరకాల వాంఛ నేరవేరుస్తారని గంపెడాశతో ఉన్నారు.

ఈ ప్రాంత ప్రజలకు మేలు

నియోజకవర్గంలో చెన్నూర్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీలతో పాటు ఐదు మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు భూ సమస్యల పరిష్కరం కోసం మంచిర్యాలలోని రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాలంటే 80 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. దూరభారంతో పాటు ఆర్థిక భారం పడి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా రెవెన్యూ డివిజన్ అనివార్యం. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రతిపాదనలకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల కొంత జాప్యం జరిగింది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రెవెన్యూ డివిజన్, రెండు కొత్త మండలాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మెరుగైన వేతన ఒప్పందం సాధించాం



సీతారామయ్యను సన్మానిస్తున్న నాయకులు

కాసిపేట: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు ద్వారా మెరుగైన వేతన ఒప్పందం సాధించామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, శాశ్వత వేజ్‌బోర్డు సభ్యుడు సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రెండేళ్ల కాలం వృథా అయ్యిందన్నారు. పది సార్లు సమావేశం జరిగినా ఐదుసార్లు వాయిదా పడిందన్నారు. ఈ సందర్భంగా సీతారామయ్యను ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, నాయకులు బియ్యాల వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, రవీందర్, నాగేశ్వరరావు, శ్రీహరి, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

కుల, చేతివృత్తులకు రూ.లక్ష సాయం

మంచిర్యాలటౌన్: కుల, చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించే పథకాన్ని శుక్రవారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవాలని, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు ఉండాలన్నారు. https://tsobmmsbc.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, కులం, నివాసం, ఆదాయ ధృవీకరణపత్రం, రేషన్ కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓబీ లక్ష్యాలు సాధించాలి

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనుల్లో నిర్దేశించిన ఓవర్ బర్డెన్ (మట్టి వెలికితీత) లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్లు పేర్కొన్నారు. కంపెనీ డైరెక్టర్ శ్రీనివాస్ (ఆపరేషన్) వెంకటేశ్వర్ రెడ్డి(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) గురువారం ఏరియా జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ నుంచి ఏరియా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ ఏరియాలోని రెండు ఓసీపీల్లో నిర్దేశించిన ఓబీ లక్ష్యాన్ని సాధించడానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఓపెన్ కాస్ట్ గని ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాస్, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఓసీపీ ఓబీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి అధికారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంవోఏఐ) శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి దేవేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం నస్పూర్‌కు వస్తున్న నేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. కంపెనీలో ఉద్యోగుల పిల్లలకు ఇస్తున్నట్లుగా ఐఐటీ ఐఐఎంలో చదువుతున్న అధికారుల పిల్లలకు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని, కంపెనీ క్వార్టర్లకు ఉచిత విద్యుత్ అందించాలని, 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఆర్‌పీ మొత్తాలను చెల్లించాలని కోరారు.

ఉమ్మడి జిల్లా బాక్సింగ్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న మంచిర్యాలలోని జెడ్పీ బాలుర మైదానంలో బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.నివాస్‌గౌడ్, ఎం. శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 జిల్లా జట్టు ఎంపిక, అండర్–14, అండర్–12 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రాలతో రిపోర్టు చేయాలని, ఇతర వివరాలకు 9963539234 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

సదరం శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

పాతమంచిర్యాల: ఈ నెల 14 నుంచి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించనున్న సదరం శిబిరాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. 14న శారీరక వికలాంగులు, కంటి చూపు సమస్యలున్నవారికి, 22న మూగ, చెవుడు, మానసిక వికలాంగులకు స్పెషలిస్టు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సబ్జెక్టులు టీజీటీ, పీజీటీ, జేఎల్, పీఈటీ స్టాఫ్‌ను భర్తీ చేస్తున్నందువల్ల మహిళలు, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15లోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు మైనార్టీ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

సీఎం సభ విజయవంతం చేయాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్



మాట్లాడుతున్న వెంకట్రావ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ఉద్యోగులంతా నేడు నస్పూర్‌లో జరుగనున్న సీఎం కేసీఆర్ బహిరంగసభకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావ్ కోరారు. గురువారం ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో ఏ ముఖ్యమంత్రి కార్మికులకు చేయనంతా మేలు కేసీఆర్ చేశారన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్‌ను తిరిగి కారుణ్య ఉద్యోగాల పేరుతో పునరుద్ధరించారన్నారు. సమావేశంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, చర్చల ప్రతినిధులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జీఎం కమిటీ నాయకులు పెట్టం లక్ష్మణ్, కాశీరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న ఎస్కే బాజీసైదా

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిపై కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడారు. 2018లో ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని, అన్ని హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. సింగరేణిలో 26 వేలమంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, లాభాల్లో వాటా చెల్లించాలని, కార్మికులు చనిపోతే రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కేసీఆర్ నస్పూర్‌కు వస్తున్న సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై స్పందించి కంపెనీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు అఫ్రోజ్‌ఖాన్, శ్యామ్, సంతోష్, వెంకటేశ్, శైలజ, రాజేశ్వరి, శంకర్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భర్త దాడిలో గాయపడిన మహిళ మృతి

- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ మహేందర్‌రెడ్డి



నిందితుడి అరెస్టు చూపిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

రామకృష్ణాపూర్(చెన్నూర్): భర్త దాడిలో గాయపడిన మహిళ మృతి చెందింది. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గంగాకాలనీలో నివాసముండే అన్నేడి లచ్చిరెడ్డి సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. పదేళ్లక్రితమే ఉద్యోగ విరమణ పొందగా వచ్చిన డబ్బులన్నీ అతని భార్య మల్లవ్వకు అప్పగించాడు. పెన్షన్‌తో పాటు భూమి కౌలుడబ్బులు కూడా ఆమెకే ఇచ్చేవాడు. అయితే తన వ్యక్తిగత అవసరాలకు డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో తరచూ వారిమధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో పథకం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అతని భార్య మల్లవ్వను ఇంట్లోనే గొడ్డలితో మెడపై నరికాడు. కోడలు మంజుల కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నిందితుడు లచ్చిరెడ్డిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. సమావేశంలో పట్టణ ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా తూనికలు కొలతలశాఖ అధికారి విశ్వేశ్వర్



చేపల మార్కెట్‌లో కాంటా పరిశీలిస్తున్న అధికారి

పాతమంచిర్యాల: వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు కొలతలశాఖ అధికారి కే.విశ్వేశ్వర్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్, సీసీసీ, ఏసీసీ, లక్ష్మీ థియేటర్ ఏరియాల్లోని చేపల మార్కెట్లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికల రాళ్లు, కాంటాలపై ముద్రలు లేకుండా తూకం వేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కొంతమంది వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతున్నట్లు తమదృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా 25 దుకాణాలు తనిఖీ చేసి ముద్రలు లేకుండా విక్రయాలు సాగిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, సిబ్బంది ఉన్నారు.

మార్కులు తక్కువ వస్తాయేమోనని ...

- రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య
- నాలుగు రోజుల క్రితం ఘటన



రాథోడ్ సచిన్ (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): పరీక్షలో మార్కులు తక్కువగా వస్తాయేమోనని బెంగతో విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలంలోని అనార్‌పల్లికి చెందిన రాథోడ్ దత్తారాం, కవితాబాయి దంపతులకు కుమారుడు సచిన్ (19), కూతురు ఉన్నారు. సచిన్ ఆర్నెళ్లుగా ఉట్నూర్‌లోని ఓ ప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లో జేఈఈ కోచింగ్ తీసుకున్నాడు. పరీక్ష రాసేందుకు శనివారం రాత్రి ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు ట్రావెల్స్‌లో బయలుదేరాడు. ఈ నెల 4న (ఆదివారం) హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో జరిగిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు హాజరయ్యాడు. ఆదివారం సాయంత్రం దత్తారాం కుమారుడితో మాట్లాడగా సోమవారం ఉదయం ఇంటికి వస్తానని చెప్పాడు. అదేరోజు రాత్రి ఎల్బీనగర్ సమీపంలో లోకల్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న బంధువులకు విషయం తెలియడంతో ఎల్బీనగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లగా ఆత్మహత్య చేసుకున్న విషయం తెలియడంతో బోరున విలపించారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

- పాల్గొననున్న 2,241 మంది అధికారులు, సిబ్బంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నస్పూర్(మంచిర్యాల): ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 2,241 మంది ఉన్నతాధికారులు, అధికారులు, ఇతర సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి పోలీసులు నస్పూర్ పట్టణానికి చేరుకున్నారు. నలుగురు ఎస్పీలు, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 18 మంది ఏసీపీ/డీసీపీలు, 62 మంది సీఐలు, 182 మంది ఎస్సైలు, ఆర్ఎస్సైలు, రోప్ టీంలు, స్పెషల్, ఆర్మ్‌డ్, కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొననున్నారు.

ఏర్పాట్లు పూర్తి

పట్టణంలో నేడు సీఎం కేసీఆర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. సమీకృత కలెక్టరేట్ భవనం ఆవరణలో హెలీప్యాడ్ సిద్ధం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. సీఎం బహిరంగసభ వద్ద వేదిక పనులు పూర్తయ్యాయి. వీఐపీ, ప్రెస్, తదితర గ్యాలరీలు, పార్కింగ్ స్థలాలు సిద్ధం చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణం బీఆర్ఎస్ జెండాలు, ఫ్లెక్సీలతో గులాబీమయం అయ్యింది. నాయకులు జన సమీకరణకు కావాల్సిన వాహనాలు సమకూర్చుకుంటున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

గోదావరిఖని, చెన్నూర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే వాహనదారులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద గల జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా క్యాతన్‌పల్లి గాంధారి వనం నుంచి మంచిర్యాలకు చేరుకోవాలి. మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్, చెన్నూర్, గోదావరిఖనికి వెళ్లే వాహనదారులు క్యాతన్‌పల్లి గాంధారి వనం వద్ద గల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్దగల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సీఎం పర్యటన ముగిసే వరకూ ఈ ఆంక్షలు ఉంటాయని, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సమీకృత కలెక్టరేట్ భవనం వద్ద పోలీసులు

